

వసూళ్ల పర్వం

రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటేనే భూములకు విలువ. ఈ ప్రక్రియకు భారీగా ముడుపులు చెల్లించుకోవాల్సివస్తోంది.

8లో ▸



వరిలో నారుమడి కీలకం

నారుమడి తయారీలో జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

8లో ▸



ఓటు నమోదు చేసుకోవాలి

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు.

9లో ▸

న్యూస్‌రీల్

నేడు పద్మనాభ స్వామి ఆలయంలో కోడెల వేలం

అనంతగిరి: అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయం కార్తీక మాస జాతర ఉత్సవాలను పురస్కరించుకుని పలువురు భక్తులు దేవునికి కోడెలను వదిలిపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాగా మొత్తం 12 కోడెలు వచ్చాయని ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోడెలను సోమవారం మధ్యాహ్నం 12గంటలకు ఆలయం ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించి రైతులకు, వ్యవసాయదారులకు ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

డేటా ఎంట్రీ కీలకం



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సర్వేలో సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ చేయడమనేది కీలకమైన ప్రక్రియని.. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వొద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు.

యాలాల ఎస్‌ఐగా గిరి



యాలాల: యాలాల ఠాణా ఎస్‌ఐగా గిరిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన శంకర్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. పెద్దేముల్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న గిరిని యాలాల మండలానికి కేటాయించారు. కాగా గిరి యాలాల ఠాణాలో గతంలో ఆరు నెలల పాటు ప్రొబేషనరీ ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్



శైలజారామయ్యర్‌ను సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

బంట్వారం: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ అన్నారు. ఆదివారం కోట్‌పల్లి మండలం నాగసాన్‌పల్లి సమీపంలోని క్వాంటం లైఫ్ ఫౌండేషన్‌లో బ్రహ్మ జ్ఞాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి ధ్యాన కేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవర్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. క్వాంటం లైఫ్ ఫౌండేషన్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులు శైలజారామయ్యర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త డాక్టర్ లక్ష్మి, డాక్టర్ న్యూటన్ కొండవీటి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి

అనంతగిరి: నేషన్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1,026 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న ఈ పరీక్షకు వికారాబాద్ పట్టణంలో నాలుగు, తాండూరు పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 975 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 51 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. పరీక్షకు హాజరైన వారి నుంచి 74 మంది విద్యార్థులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు.

అనంతగిరిలో భక్తుల సందడి



అనంతగిరి గుట్టకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. సెలవుదినం కావడంతో అనంత పద్మనాభ స్వామి వారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేశారు. అనంతరం అటవీ ప్రాంతంలో భోజనాలు చేస్తూ సేదతీరారు.

– అనంతగిరి



ఫార్మా కాదు.. పారిశ్రామిక వాడ

- 'లగచర్ల' ఘటన నేపథ్యంలో ఫార్మాసిటీ ఏర్పాటుపై ప్రభుత్వం వెనుకడుగు
- కొత్త చర్చకు తెరలేపిన ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- ఫార్మా విలేజెస్ పేరిట గత గెజిట్

వికారాబాద్/దుద్యాల్: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం కాస్త వెనక్కి తగ్గినట్టే కనిపిస్తోంది. ఇది కేవలం ఒకే ఒక అడుగు మాత్రమేనని స్పష్టమవుతోంది. ఈ నెల 11న లగచర్లలో కలెక్టర్ సహా జిల్లా అధికారులపై దాడి జరగటంతో పాటు తదనంతర అరెస్టులతో సీఎం సొంత నియోజకవర్గం దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయదలిచిన ఫార్మాసిటీ అంశం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఘటన జరిగిన మొదటి రోజు అందరూ అధికారులపై దాడి విషయమై చర్చించుకోగా.. ఆ మరుసటి రోజు నుంచి చర్చ మొత్తం రివర్స్ అయింది. ఘటనాంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి 40మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకోవడం.. అందులో ఇప్పటి వరకు 28 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం.. అరెస్టు అయిన వారిలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కూడా ఉండడం.. బాధిత రైతులు రాష్ట్ర, దేశ స్థాయిలో హక్కుల సంఘాలను, కమిషన్లను ఆశ్రయించడం.. హక్కుల సంఘాలు, కమిషన్లు లగచర్లను సందర్శించడం.. ప్రభుత్వాన్ని నివేదిక కోరడం.. ప్రతిపక్ష పార్టీలు రంగంలోకి దిగడం తదితర పరిణామాలు లగచర్ల ఘటనను దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. దీంతో ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో కాస్త వెనక్కి తగ్గినట్టు కనిపిస్తోంది.



ఇటీవల లగచర్ల ఘటనపై సేకరించిన అంశాలను ముఖ్యమంత్రికి నివేదిస్తున్న వామపక్ష నేతలు

5 గ్రామాలు, 800 మంది రైతులు, 1,358 ఎకరాలు

మూడు నెలల క్రితం ఫార్మాసిటీ ప్రతిపాదన వచ్చింది. కొండంగల్ నియోజకవర్గం దుద్యాల మండల పరిధిలోని లగచర్ల, పోలెపల్లి, హకీంపేట్, రోటిబండతండా, పులిచర్లగుట్ట తండాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఐదు గ్రామాలకు చెందిన 1,358 ఎకరాల భూమిలో ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో 547 ఎకరాలు అసైన్డ్ భూమి, 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా 721 ఎకరాల పట్టా భూమి ఉంది. మొత్తం 800మంది రైతులు ఫార్మాసిటీ కోసం నిర్వహించే భూ సేకరణలో తమ భూములు కోల్పోనున్నారు. ఒక్కో రైతు సగటున ఎకరంన్నర భూమి కోల్పోతుండగా బాధిత రైతుల్లో ఎక్కువ శాతం సన్న చిన్నకారు రైతులే. వీరికి ఈ భూములు తప్ప వేరే జీవనోపాధి లేకపోవడం.. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించాలనుకుంటున్న 1,268 ఎకరాల పరిధిలో 800 మంది(ఎక్కువ సంఖ్యలో) రైతులు ఉండటమే గాకా వారికి వేరే జీవనాధారం లేకపోవటంతో జీవన్మరణ సమస్యగా మారింది. దీంతో ఫార్మా సిటీ ప్రతిపాదించింది మొదలు ఫార్మా బాధిత రైతులు ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ వస్తున్నారు.

భూ సేకరణ ఖాయమేనా?

ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం మాటమార్చడం వ్యూహాత్మక ఎత్తుగడలో భాగమేనని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మూడు నెలల క్రితం ఫార్మాసిటీ ఏర్పాటు ప్రకటన విడుదల చేసి తదనంతరం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోనూ ఇదే విషయం ప్రస్తావించింది. కాగా ప్రతిపాదన వెలువడి నాటి నుంచే భూ సేకరణలో భూములు కోల్పోతున్న ఐదు గ్రామాల ప్రజలు, రైతులు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. తమ జీవనాధారమైన భూములిచ్చేది లేదని రైతులు పేర్కొంటూ రాగా.. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఫార్మాసిటీ ఏర్పాటు ప్రతిపాదనకు కాలుష్యకారక పరిశ్రమల ఏర్పాటును విమర్శిస్తూ.. రైతులను సైతం మొబిలైజ్ చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతన సంతరించుకున్నాయి. లగచర్ల పర్యటన అనంతరం సీఎంను కలిసిన వామపక్ష నేతలతో సీఎం 'అక్కడ ఫార్మాసిటీ ఏర్పాటు చేయబోం.. నా నియోజకవర్గ ప్రజలకు నేనే అన్యాయం చేస్తానా..? కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు.. అక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. దీంతో అక్కడ ఫార్మాసిటీ ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచిస్తోందనేది సుస్పష్టం. ఇదే సమయంలో అక్కడ పారిశ్రామిక వాడ నిర్మించడ.. భూ సేకరణ ఉంటుందనే విషయం సైతం చెప్పినట్లయింది. ఇదే సమయంలో ప్రతిపక్షాలు పేర్కొంటున్నట్టు కాలుష్యకారక పరిశ్రమలుండవని ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పకొట్టడం లాంటి వ్యూహాత్మక ఎత్తుగడలో భాగంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని విశ్లేషకులు భావిస్తున్నారు.

25 ఎకరాల్లో 'ఇంటిగ్రేటెడ్'

- తిమ్మాయిపల్లిలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి
- డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన!

తాండూరు: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లను మంజూరు చేసింది. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం శుక్రవారం జీఓ నంబర్ 223ను జారీ చేశారు. మలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 26 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను మంజూరు చేశారు. ఇందులో జిల్లా పరిధిలోని వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు ఒకటి చొప్పున పాఠశాలలు మంజూరయ్యాయి. తాండూరు నియోజవకర్గానికి మంజూరు చేసిన ఇంటిగ్రేటెట్ స్కూల్‌ను యాలాల మండలం తిమ్మాయిపల్లి గ్రామ శివారులో నిర్మించనున్నారు. ఇందుకుగాను తాండూరు–మహబూబ్ నగర్‌జాతీయ రహదారి పక్కనున్న 25 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార యంత్రాంగం సేకరించింది. తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలోకి వచ్చే 25 ఎకరాల భూమిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అందించేలా ప్రణాళికలు రూపొందించారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో వసతి, గదులు, తరగతి గదులు, క్రీడా ప్రాంగణం, పార్కులు, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ శిక్షణకు 60 కంప్యూటర్‌లతో ప్రత్యేక విభాగం, డిజిటల్ భోధనకు బోర్డులు, చదువుకునేందుకు అన్ని మౌలిక సదుపాయాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అందుబాటులోకి రానుంది. వసతి గదుల్లో ఉండే విద్యార్థులకు ప్రతీ బెడ్‌కు ఒక వాష్‌రూమ్ ఉండేలా భవన నిర్మాణాలను డిజైన్ చేశారు. పక్షం రోజుల వ్యవధిలోనే తిమ్మాయిపల్లిలో శంకుస్థాపనలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

భవిష్యత్‌లో ఉత్తమ ఫలితాలు



అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యఅందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసి గురుకులాల్లో పేదలు ఉన్నత విద్యను అభ్యసించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు రావడం ఖాయం. తాండూరు నియోజకవర్గానికి మంజూరైన పాఠశాల శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చేతులమీదుగా చేయించేందుకు సిద్ధమవుతున్నాం.

– బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే ,తాండూరు



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నమూనా చిత్రం



శనివారం వికారాబాద్‌లో అర్బన్ పార్క్ పనులకు శంకుస్థాన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అటవీశాఖ మంత్రి పేరు ఎక్కడ.?

అధికారుల పనితీరుపై ఆగ్రహం

వికారాబాద్/పరిగి: ప్రజలకు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న అర్బన్ పార్క్ నిర్మాణానికి శనివారం వికారాబాద్, పరిగిలో శంకుస్థాపన చేశారు. వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పరిగిలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఈ పనులను ప్రారంభించారు. కాగా వారు ఆవిష్కరించిన శిలాఫలకాలపై అధికారులు, మంత్రుల పేర్లున్నప్పటికీ సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖ పేరు లేదు. దీంతో అధికారుల పనితీరుపై పలువురు మండి పడుతున్నారు. రెండు చోట్ల ఒకే రోజు చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించగా రెండు చోట్ల మంత్రి పేరును విస్మరించారు. దీంతో అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అటవీశాఖ అధికారుల వివరణ కోరినట్లు సమాచారం.



పరిగిలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సిబ్బంది లేక.. సర్వే సాగక

ఇటు రహదారులు.. అటు చెరువులు

- రెండు మండలాలకు ఒక సర్వేయర్
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- 2,500 పైగా దరఖాస్తులు పెండింగ్
- భూ బాధితులకు తప్పని నిరీక్షణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో భూ క్రయ, విక్రయాలే కాదు విస్తీర్ణం, సరిహద్దు వివాదాలు కూడా ఎక్కువే. ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములతో పాటు రియల్ ఎస్టేట్ వెంచర్లలో వెలిసిన ఖాళీ ప్లాట్ల సరిహద్దుల విషయంలో తరచూ వివాదాలు తలెత్తుతుంటాయి. భూ విస్తీర్ణం సహా సరిహద్దుల నిర్ధారణ కోసం ప్రైవేటు సర్వేయర్లను సంప్రదిస్తారు. వారిచ్చే రిపోర్టులపై విశ్వసనీయత లేకపోవడంతో మెజార్టీ భూ బాధితులు ప్రభుత్వ సర్వేయర్లను ఆశ్రయిస్తుంటారు. జిల్లా నిష్పత్తి మేరకు సర్వేయర్లు లేకపోగా, ఉన్నవారు కూడా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ, రీజినల్ రింగ్‌రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ఫోర్త్ సిటీ కోసం చేపట్టే భూ సేకరణలో బిజీగా మారారు. ఫలితంగా భూముల సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న 2,500 మందికిపైగా భూ బాధితులకు నెలల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. పక్కనే ఉన్న హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పని చేస్తున్న సర్వేయర్లను డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి పని పూర్తి చేయించే అవకాశం ఉన్నా.. జిల్లా అధికారులు ఆ దిశగా ఆలోచించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ప్రాజెక్టుల్లోనే వాళ్లంతా బిజీ

హైదరాబాద్ జిల్లాలో ఖాళీ స్థలాలు పెద్దగా లేవు. 16 మండలాలకు గాను 19 మంది సర్వేయర్లు ఉన్నారు. ఇక్కడ భూ వివాదాలు కూడా చాలా తక్కువ. వీరికి పెద్దగా పని కూడా లేదు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా, 18 మంది సర్వేయర్లు ఉన్నారు. ఇక 27 మండలాలు ఉన్న కీలకమైన రంగారెడ్డి జిల్లాలో మాత్రం 14 మందే ఉన్నారు. రెండు, మూడు మండలాలకు ఒక సర్వేయర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ప్రభుత్వ భూముల సర్వేకు తోడు.. ప్రాజెక్టులు, రోడ్ల కోసం ప్రభుత్వం చేపట్టే భూ సేకరణలో వీరంతా బిజీగా మారుతున్నారు. సాధారణ భూ బాధితులు సర్వే కోసం దరఖాస్తు చేసి నెల రోజులు దాటినా.. అటు వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి. వివాదాలను త్వరగా పరిష్కరించుకోవాలనే భూ బాధితుల్లో ఉన్న బలహీనతను కొంతమంది సర్వేయర్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఏరియా, భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. గతంలో గండిపేట మండల సర్వేయర్ ఒకరు ఇదే అంశంపై పట్టుబడటం విశేషం.

ఉద్దేశపూర్వకంగానే..

జిల్లా అవసరాలు, సర్వేయర్ల కొరత, తలెత్తుతున్న సమస్యలను ముందే గుర్తించి ప్రభుత్వానికి తగిన నివేదిక అందజేయాల్సి ఉంది. కానీ ఓ జిల్లా స్థాయి అధికారి ఉద్దేశపూర్వకంగానే కొత్త సర్వేయర్ల కేటాయింపు అభ్యర్థన ఫైలును తొక్కిపెడుతున్నట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో.. సరిహద్దు జిల్లాల్లో పని చేస్తున్న సర్వేయర్ల సేవలను వినియోగించుకునే అవకాశం ఉన్నా.. జిల్లాపై తనకున్న గుత్తాధిపత్యం ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోననే భయంతో పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఉద్దేశ పూర్వకంగానే సర్వేయర్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు సర్వేయర్ ఏసీబీ కేసులో పట్టుబడి ఖాళీగా ఉన్న మణికొండ సహా, రాజేంద్రనగర్, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం, హయత్‌నగర్, బాలాపూర్, అబ్దుల్లాపూర్ మెట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలాల్లో తనకు అనుకూలమైన వారిని నియమించుకుని, వారి ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి.

గ్రేటర్ జిల్లాల్లో సర్వేయర్లు ఇలా..

జిల్లాపేరు	మండలాలు	సర్వేయర్లు
హైదరాబాద్	16	19
మేడ్చల్	15	18
రంగారెడ్డి	27	14

క్లుప్తంగా

ఓవర్‌లోడ్‌తో నిత్యం అవస్థలు



కరన్‌కోట్ గ్రామంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్ గ్రామం మీదుగా ఓవర్‌లోడ్ లారీలు వెళ్తున్నాయి. గ్రామ శివారులోని క్రషర్ నుంచి నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో లైమ్‌స్టోన్‌ను తరలిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లడంతో కరన్ కోట్ గ్రామంలోని ప్రధాన రోడ్డు ధ్వంసమై పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల్లో లైమ్ స్టోన్ తరలించే క్రమంలో కనీసం టార్పాలిన్ కూడా కప్పడం లేదన్నారు. లారీల నుంచి వచ్చే దుమ్మూ రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లల్లోకి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి



వెంకటయ్య మృతదేహం

ధారూరు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి కిందపడి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ధారూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కుక్కిందకు చెందిన కె.వెంకటయ్య(35) మద్యానికి బానిసై గ్రామంలో తిరిగేవాడు. ఆయన శనివారం రాత్రి మద్యం మత్తులో ధారూర్‌లోని ఓ ఇంటి ఎదుట కింద పడ్డాడు. కొంత సేపటికి స్థానికులు వచ్చి లేపగా ఆయన ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్నాడు. గ్రామస్తులు పరీక్షించగా వెంకటయ్య మృతి చెందటంతో తండ్రి అనంతయ్యకు సమాచారం ఇచ్చారు. తాగిన మైకంలో తన కుమారుడు కింద పడి మృతి చెందాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వేణు గోపాల్‌గౌడ్ తెలిపారు.

రోడ్డుపై ధాన్యం 'వర్రీ'



దౌల్తాబాద్: రహదారులపై వరి ధాన్యాన్ని ఆరబెట్టడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో ఇటీవల వీటితో ప్రమాదాలు సైతం జరిగాయి. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టవద్దని పోలీసులు హెచ్చరించినా అక్కడక్కడ రైతులు రహదారిపైనే ఆరబెడుతున్నారు. దౌల్తాబాద్ నుంచి కోస్గి వెళే మార్గంలో ఇర్లపల్లి గ్రామ సమీపంలో ఇలా రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టారు.

వసూళ్ల పర్వం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని కావాలంటే చదివించుకోవాల్సిందే
- డాక్యుమెంట్ రైటర్లే మధ్యవర్తులు
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.వేలల్లో దోపిడీ



పరిగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పరిగి: బంగారం లాంటి భూమి, ప్లాటయినా రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటేనే విలువ. అంత కీలకమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవ్వాలంటే అడుగడుగున ముడుపులు చెల్లించుకోవాలి. డాక్యుమెంట్ తయారీ కావాలన్నా, రిజిస్ట్రేషన్ పూర్తి కావాలన్నా మామూళ్ల ప్రక్రియ పూర్తి చేయాల్సిందే. దీంతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని కొనుగోలుదారులు ఆవేదన చెందుతున్నారు. పరిగి పట్టణం, శివారుతో పాటు ఆయా మండలాల్లో విచ్చలవిడిగా అధికారిక, అనధికారిక లేఅవుట్లు వెలుస్తున్నాయి. ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం మామూళ్లు ఇవ్వనిదే పనికావడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్లాట్లు కొన్న వారు రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ చార్జీలకు వేలకు వేలు చెల్లిస్తున్నారు. ఇదే అదునుగా పని తొందరగా కావాలంటే అధికారులకు ముడుపులు ఇచ్చేందుకు ఖర్చు అవుతాయంటూ డాక్యుమెంట్ రైటర్లు ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారు.

అంతా తామై

పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం 10 నుంచి 15 రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. చుట్టు పక్కల ఉన్న డాక్యుమెంట్ రైటర్లు అంతా తామై ఈ దందాను కొనసాగిస్తున్నారు. ప్రతీ రిజిస్ట్రేషన్‌కు కార్యాలయంలోని అన్ని స్థాయి ఉద్యోగులకు మామూళ్లు ఇవ్వాలని దర్జాగా వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ రుసుం కాకుండా అదనంగా సుమారు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేసుకుని పంచుకుంటున్నట్లు ప్రచారం. డాక్యుమెంటరీ చార్జీలు కాకుండా అదనంగా ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని డిమాండ్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పని చేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగితో అధికారులు అన్ని లావాదేవీలు, డీలింగ్‌లు జరుపుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో రోజు ప్రభుత్వానికి చెల్లించే రుసుం కంటే ఎక్కువగానే మామూళ్ల వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ లే అవుట్లకు సపరేటు

పట్టణంతో పాటు ఆయా మండలాల్లో అక్రమ లేఅవుట్లు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లే అవుట్లు ఎన్నో ఉన్నాయి. అనధికారిక లే అవుట్లు చేసి తొలిసారిగా ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి ఒక్కో ప్లాటుకు రూ.50 వేలకు పైగానే చెల్లిస్తేనే పని అవుతుందని సమాచారం. ఇందుకు కొందరు డాక్యుమెంట్ రైటర్లతో పాటు దళారులను పెట్టుకుని రియల్టర్లతో సెటిల్ అయ్యాకనే రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్న ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థ లేదు. వాళ్లు ఆన్‌లైన్ చార్జీలు మాత్రమే తీసుకోవాలి. ఎవరైనా అధిక డబ్బులు వసూలు చేస్తే మా దృష్టికి తీసుకురావాలి. వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి కట్టే రుసుం తప్ప అందకు మించి ఎవరికీ డబ్బులు ఇవ్వరాదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పేరు చెప్పి డబ్బులు తీసుకుంటే మాకు తెలపండి.

– శ్రీనివాస్, పరిగి సబ్ రిజిస్ట్రార్

హత్య చేసేందుకు కుట్ర

పోలీసులను ఆశ్రయించిన రైతులు

కుల్కచర్ల: భూ సంబంధిత వ్యవహారంలో తమను హత్య చేసేందుకు సమీప పొలాల రైతులు యత్నిస్తున్నారని ఓ రైతు కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గండీడ్ మండలం చిన్న వార్వాల్ గ్రామనికి చెందిన కోస్గి లక్ష్మి కుటుంబ సభ్యులకు కుల్కచర్ల మండలం అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ సర్వే నంబర్ 69లో 12 ఎకరాల భూమి ఉంది. అక్కడ పొలం పనులకు వెళ్తున్న క్రమంలో తమ ప్రాణాలు తీసేందుకు యత్నిస్తున్నారని కోస్గి లక్ష్మి, అంజిలయ్య దంపతులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న పొలం వద్దనున్న గుడిసెకు విద్యుత్‌షాక్ ఇచ్చేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించి జాగ్రత్త పడ్డామని.. 23న పొలానికి వెళ్తున్న క్రమంలో వాగులో విద్యుత్ వైర్లతో షాక్ ఇచ్చేందుకు యత్నించగా స్వల్ప గాయాలతో బయటపడ్డామని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



పోలీసుల అదుపులో నిందితుడు

కందుకూరు: మేకలు మేపడానికి వెళ్లిన ఓ మహిళ మెడలో నుంచి నకిలీ బంగారు పుస్తెలతాడును ఓ దొంగ తస్కరించాడు. గ్రామస్తులు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడవెల్లికి చెందిన జగదీశ్వర్ మేకలు మేపుకొంటూ జీవిస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం పని నిమిత్తం గ్రామ సమీపంలో ఉన్న బేగంపేట గ్రామానికి వెళ్లాడు. మేకలను తల్లిదండ్రులు వానరాసి జంగమ్మ, వీరాస్వామికి అప్పజెప్పాడు. దీంతో వారు మేకలను గ్రామ సమీపంలో మేపడానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వీరాస్వామి మేకలకు నీళ్లు తాగించడానికి పక్కనే ఉన్న మామిడి తోటలోకి కొట్టుకెళ్లాడు. ఆ సమయంలో రహదారి పక్కనే ఉన్న పొలంలో జంగమ్మ ఒంటరిగా కూర్చొని ఉంది. గుమ్మడవెల్లి వైపు నుంచి ఓ దుండగుడు బైక్‌పై వచ్చి ఒంటరిగా కూర్చొని ఉన్న ఆమె వద్దకు వచ్చి చిరునామా అడుగుతున్నట్లు నటించి మెడలో ఉన్న రూ.2 వేల విలువ గల నకిలీ బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయాడు. దీంతో ఆమె కుమారుడు జగదీశ్వర్‌కు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే అప్రమత్తమైన అతను గ్రామస్తులతో కలిసి బేగంపేటలో ఆ బైక్‌ను అడ్డుకుని దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మా గ్రామాన్ని మున్సిపల్‌లో కలపొద్దు

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు దేవునిఎర్రవల్లి గ్రామస్తుల వినతి



ఎమ్మెల్యే యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దేవునిఎర్రవల్లి గ్రామస్తులు

చేవెళ్ల: కొత్తగా ఏర్పాటు చేయబోయే చేవెళ్ల మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలుపొద్దని దేవునిఎర్రవల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే కాలె యాదయ్యకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చేవెళ్ల మున్సిపాలిటీగా మార్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే తమ గ్రామాన్ని మాత్రం కలప వద్దన్నారు. మండల కేంద్రానికి తమ గ్రామం దూరంగా ఉండటంతోపాటు ఎక్కువ మంది రైతులు, పేదలు ఉన్నారని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకొని తమ గ్రామాన్ని మున్సిపల్‌కు మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, బక్కయ్య, జంగయ్య, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తూరుతండాలో ఢీకొన్న రెండు బైకులు

కొత్తూరు: రెండు బైకులు ఢీకొని గాయపడిన ఓ వ్యక్తి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు తండాలో నివాసం ఉంటున్న మంగళి కిశోర్(42) పట్టణంలో హెయిర్ సెలూన్ నిర్వహిస్తున్నాడు. కాగా శనివారం రాత్రి షాపు మూసిన తర్వాత తన బైకుపై పట్టణం నుంచి ఇంటికి వెళ్తుండగా కొడిచర్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్, సందీప్‌లు ఆయన వెనకాల నుంచి అతి వేగంగా బైకుపై వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కిశోర్ తల, చేతికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. శ్రీకాంత్, సందీప్‌లకు సైతం గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

చోరీకి గురైన బైక్‌ల అప్పగింత

తలకొండపల్లి: సీసీ కెమెరాల ద్వారా చోరీకి గురైన బైక్‌లను గుర్తించి బాధితులకు పోలీసులు అందజేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో శనివారం సంత ఉండడంతో పూల్‌సింగ్ తండాకు చెందిన వ్యక్తి బైక్‌ను పార్క్ చేసి కూరగాయలను కొనడానికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి తన బైక్ కనిపించక పోవడంతో, ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి సీసీ కెమెరాల బైక్‌ను గుర్తించి, ఆ వ్యక్తికి పోలీసులు బైక్‌ను అప్పగించారు. అదే విధంగా మండల పరిధిలోని చీపునుంతల్లో ఓ వ్యక్తి ప్రభుత్వ పాఠశాల దగ్గర బైక్ పార్క్ చేశాడు. పని ముగించుకొని వచ్చి చూసే సరికి బైక్ కనపడ లేదు. ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బైక్‌ను బాధితుడికి అందజేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ ఆదివారం చెప్పారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: మత్స్య కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు చేపలు పంపిణీ చేస్తున్నామని ఓ పక్క గొప్పలు చెప్పి.. మరోపక్క చెరువులు, కుంటలు కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాలకు గురైన చెరువులు, కుంటలు, కాలువలను కాపాడేందుకు హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే.. బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. చేపల అమ్మకానికి సరైన మార్కెట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ బర్ల మంగయాదవ్, మత్స్యకారుల సంఘం, మత్స్యకార్మిక సొసైటీ నాయకులు గుంటి భీంరావు, రాములు, బాబు, శ్రీనివాస్, సీతయ్య, వెంకటేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాసబ్ చెరువులో

తుర్కయంజాల్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మాసబ్ చెరువులో ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ బలయ్య, కౌన్సిలర్ సునీల్, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, సామ భీంరెడ్డి, గోపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మేతరి దర్శన్, శేఖర్ మామ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

మంచాల: క్రీడలు శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు గ్రామీణ యువతను ప్రోత్సహిస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కావలి శ్రీనివాస్, చీరాల రమేష్, సీఐ మధు, నాయకులు మల్ల చంద్రయ్య, సురేష్, రాజు, బుగ్గరాములు, శ్రీనివాస్, భాస్కర్, కృష్ణ, కుమార్, ఏపీఎల్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

తగ్గిన పంట దిగుబడి

- ధర లేక దిగాలు
- దళారులకు అమ్మి నష్టపోతున్న అన్నదాతలు

షాబాద్: ఏటా పత్తి రైతు ఏదో ఒక రకంగా చిత్తవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడం, అకాల వర్షాలు కురుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాడు. రూ.వేల పెట్టుబడి పెట్టి సాగుచేస్తే ప్రతికూల వాతావరణంలో అంతంత మాత్రమే దిగుబడి వస్తోంది. ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి పంటను అమ్ముకునేందుకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతులకు సరైన అవగాహన లేక దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7,521 మద్దతు ధరను ప్రకటించగా దళారులు క్వింటాలు పత్తిని రూ.6400 నుంచి రూ.6500 ధరతో కొనుగోలు చేస్తున్నారు.

అనుకూలించని వాతావరణం

సీజన్ మొదట్లో పత్తి విత్తనాలు వేసేందుకు అనువైన వర్షాలు పడలేదు. విత్తనాలు వేసినా వర్షాల్లేక రెండు, మూడుసార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. పత్తి పూత దశకు వచ్చిన సమయంలోనూ భారీ వర్షాలు పడ్డాయి. పంట పొలాలు నీట మునిగి పూత, కాయ నేలవాలాయి. నీటిలో మునిగి తెగుళ్లు సోకి దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడి ఆశించిన స్థాయిలో వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఈసారి విత్తనాలు, ఎరువుల ధరలు భారీగా పెరిగాయని వాపోతున్నారు.

కూలీల భారం

పంట సాగు చేయడం ఒక వంతు అయితే దాని ఏరివేత రైతులకు ఇబ్బందికరంగా మారింది. పత్తి ఏరివేతకు సరిపడా కూలీలు దొరక్కపోవడంతో అవస్థలు పడుతున్నారు. పత్తి ఏరివేతకు కిలోకు రూ.10 నుంచి రూ.12 కూలీ చెల్లిస్తున్నారు. రైతులు ఆయా గ్రామాలకు వెళ్లి కూలీలను ఆటోలు, ట్రాక్టర్లలో చేలకు తరలిస్తున్నారు. వాహనాల ఖర్చులతో పాటు కిలో పత్తికి రూ.12 వరకు చెల్లించాల్సి వస్తోందని, దీంతో ఆర్థికంగా అదనపు భారం పడుతుందని రైతులు అంటున్నారు.

మోసపోతున్న రైతులు

సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ కొనుగోళ్లలో జాప్యంతో పాటు రైతులకు సరైన అవగాహన లేక రైతులు దళారులకు పంటలను విక్రయిస్తున్నారు. రైతులు ఇంట్లో పత్తి నిల్వ చేసుకోలేక తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని దళారులు నాసిరకంగా ఉందని సాకులు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది.

చదువుతో పాటు వేదాలు నేర్చుకోవాలి

బ్రాహ్మణ సమాఖ్య పాలమూరు జిల్లా అధ్యక్షుడు జోషి గోపాలశర్మ

షాద్‌నగర్: బ్రాహ్మణులు చదువుతోపాటుగా వేదాలు నేర్చుకోవాలని బ్రాహ్మణ సమాఖ్య పాలమూరు జిల్లా అధ్యక్షుడు జోషి గోపాల శర్మ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని పరిగి రోడ్డులో సంతోష్‌కుమార్ తోటలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. బ్రాహ్మణులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. తద్వారా సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. వేదాలు నేర్చుకోవడానికి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంచి కామకోటి పీఠాధిపతులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత బ్రాహ్మణులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మంగు రాఘవరావు, సభ్యులు ఎంకే రాజేంద్రప్రసాద్, రామ సత్యనారాయణ, సంబురాజు రవిశర్మ, స్వరూప్ సిద్ధాంతి, ప్రవీణ్, మహేష్‌శర్మ, భానుశర్మ, కృష్ణ శర్మ, రఘునాథ్‌శర్మ, శ్రీమతమ్మ, గిరిజ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవం

పట్టణంలోని ప్రశాంత్‌నగర్, సుభాష్‌నగర్ కాలనీ వాసులు ఆదివారం కాలనీలోని పార్కులో వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వరిలో నారుమడి కీలకం

- దమ్ము చేస్తేనే అధిక దిగుబడులు
- సస్యరక్షణ చర్యలతో పంటకు ప్రయోజనం
- తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి



వరి నారుమడి



తాండూరు: యాసంగిలో వరి పంటను పండిస్తున్న రైతులు నారుమడి తయారు చేసుకొనే విషయంలో తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఖరీఫ్ సాగు ముగిసి రబీలో వరి పంటను సాగుచేస్తున్న రైతులకు ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు.

నారుమడి పెంపకం

- నారుమడిని బాగా దున్ని 2–3సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి ఎత్తు నారుమళ్లను తయారు చేయాలి.
- రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని(1కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తన 12–14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పోటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడ లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయడం మంచిది.
- మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, మొదట్లో(వారం రోజులు) ఆరు తడులు ఇచ్చి, ఆ తర్వాత మొక్క దశలో పలుచగా(2–3సెం.మీ) నీరు ఉంచాలి.
- జింకు లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేటు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- మెట్ట నారుమడిలో ఇనుపధాతు లోపాన్ని గమనిస్తే సరి చేయాలి.
- నారు పీకే 7 రోజుల ముందు గుంట నారుమడికి (2.5 సెంట్లకు) 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరును ఉంచాలి. అవసరాన్ని బట్టి మడిలో ఇతర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.
- నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో రెండో దఫా నత్రజనని ఆలస్యంగా వేసి నారు ముదురకుండా చూడాలి. ఈ పరిస్థితులలో తామర పురుగులను నివారించుకోవాలి.
- నారుమడిలో బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్, సేఫనర్ 25 మి.లీ. ఎకరాకు సరిపడా నారుమడికి 5 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 8 నుంచి 10 రోజులకు పిచికారీ చేసుకోవాలి. బిస్‌పైరిబాక్ సోడియం అనే కలుపు మందును 0.5 మి.లీని ఒక లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 8–10 రోజులకు పిచికారీ చేసుకోవాలి.

ప్రధాన పొలం తయారీ

- నాట్లు వేయడానికి 15 రోజుల ముందు నుంచే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించాలి. 2 నుంచి 3 దఫాలుగా దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా చెక్కతో గాని, జంబుతోగాని ట్రాక్టరుకున్న లేవలర్‌తో కాని చదును చేయాలి.
- నాలుగు నుంచి 5 ఆకులున్న నారును నాటుకోవాలి. కొద్దిగా చౌడున్న పొలాల్లో లేత నారు వేయవద్దు, మట్ట ముదరాలి. భూసారాన్ని, రకాన్ని, కాలాన్ని బట్టి చదరపు మీటరుకు కుదుళ్ల సంఖ్య మారుతోంది.
- నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెం.మీ బాటలు తీయటంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపు చేయవచ్చు. దీర్ఘకాలిక రకాలకు చదరపు మీటరుకు 33 మధ్యకాలిక రకాలకు 44 స్వల్పకాలిక రకాలకు 66 కుదుళ్లు ఉండేటట్లు చూసుకోవాలి.
- బాగా నారు ముదిరి ఆలస్యంగా నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి, కుదురుకు 6–8 మొక్కల చొప్పున నాటు వేయాలి. అలా ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు చేసిన దాని కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా కాకుండా రెండు దఫాలుగా 70శాతం నాటి సమయంలో మిగతా 30శాతం అంకురం దశలో వాడాలి.